# సాక్షి ఖమ్మం

గురువారం । 9 । మార్చి । 2023






**'ఉపాధి' నిర్వీర్యం..**

కేంద్ర ప్రభుత్వం ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి వెంకట్ విమర్శించారు. 10లో



**ఉత్తీర్ణతకు ఊతమిచ్చేలా..!**

పదో తరగతి విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిన అభ్యాస దీపికలను అందజేసింది. 10లో

గరిష్టం / కనిష్టం
37° / 20°

**వాతావరణం**

జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు కొంత ఎక్కువగానే ఉంటాయి. రాత్రి, తెల్లవారుజామున చలి ప్రభావం కనిపిస్తుంది.

## న్యూస్‌రీల్

### బీజేపీని గద్దె దింపేవరకూ పోరాటం

రాజ్యసభ సభ్యులు వద్దిరాజు



ఖమ్మంమయూరిసెంటర్: దర్యాప్తు సంస్థలను అడ్డు పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వంపై బీజేపీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, కేంద్రంలో బీజేపీ పాలనను గద్దె దింపేవరకూ పోరాడుతామని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రశ్నించిన వారి పట్ల కేంద్ర ప్రభుత్వం పిచ్చెక్కినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేస్తోందని, తమ పార్టీ ఎమ్మెల్సీ కవితకు నోటీసులు ఇవ్వడం బీజేపీ నాయకుల కుట్రలో భాగమేనని పేర్కొన్నారు. ఈనెల 10న మహిళల హక్కుల కోసం ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద దీక్ష చేస్తున్నందునే ఈడీ నోటీసులు ఇచ్చారని ఆరోపించారు. విద్య, వైద్యం, కరెంటు, అభివృద్ధి, వ్యవసాయం, సంక్షేమం ఇవేవీ బీజేపీ ప్రభుత్వానికి అవసరం లేదని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలను ప్రజాస్వామిక, లౌకిక శక్తులు ఎండగట్టాలని కోరారు.

### ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

సీపీ విష్ణు ఎస్.వారియర్



కేక్ కట్ చేస్తున్న మహిళా అధికారులు

ఖమ్మంక్రైం: మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సీపీ విష్ణు ఎస్.వారియర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎస్‌బీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడుతూ.. అన్ని రకాల వ్యవస్థలను నడిపే శక్తి మహిళలకు ఉందన్నారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మెమోరియల్ స్కూల్ వారు ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (ఏఆర్) కుమారస్వామి, కృష్ణ ప్రసాద్ మెమోరియల్ స్కూల్ చైర్‌పర్సన్ హృదయ మీనన్, ఏసీపీలు గణేష్, రెహమాన్, ప్రసన్న కుమార్, రవి, ఏఓ అక్తరున్నీసా బేగం, సీఐలు అంజలి, సర్వయ్య, సురేష్, షీ టీమ్ ఎస్ ఉమ తదితరులు పాల్గొన్నారు.

### వెబ్‌సైట్‌లో ఇంటర్ హాల్‌టికెట్లు

ఖమ్మంసహకారనగర్: ఈ నెలలో జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ WWW.tsbie.cgg.gov.inలో ఉన్నాయని ఇంటర్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు తెలిపారు. జిల్లాలోని అన్ని కళాశాలల యాజమాన్యాలు వీటిని డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. హాల్‌టికెట్‌లో పొరపాట్లు ఉంటే సరిచేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపాల్ సంతకం లేకపోయినా పరీక్షలకు అనుమతిస్తామని పేర్కొన్నారు. ఒత్తిడికి గురికాకుండా మనోస్థైర్యం, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు.

### 15 నుంచి ప్రీ ఫైనల్ -2 పరీక్షలు

ఖమ్మంసహకారనగర్: ఈనెల 15 నుంచి పదో తరగతి ప్రీ ఫైనల్ - 2 పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను సంబంధిత ప్రధానోపాధ్యాయులు కీ సెంటర్ నుంచి ఈనెల 10 నుంచి పొందవచ్చని పేర్కొన్నారు. పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామని, ఈనెల 27 వరకు కొనసాగుతాయని తెలిపారు.

### వైద్యారోగ్య శాఖలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్



ఖమ్మం వైద్యవిభాగం: వైద్య, ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన 19 పోస్టులు భర్తీ చేస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఎన్‌ఎం, పీడియాట్రీషన్, సైకాలజిస్టు, వైద్యాధికారి, డీఈఐసీ మేనేజర్, ఆయుష్ పురుష వైద్యాధికారి, ఫార్మసిస్టు, స్పెషల్ ఎడ్యుకేటర్, ఆడియాలజిస్ట్, బయోకెమిస్ట్ విభాగాల్లో ఒక్కో పోస్టు బర్తీ చేయనున్నట్లు వివరించారు. అలాగే ఆయుష్ స్త్రీ వైద్యాధికారి, అకౌంటెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులు 3 చొప్పున ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 13 లోపు ఆన్‌లైన్ లేదా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

# పంట పండింది!

- కోటపాడులో వంద మందికి పైగా మిర్చి సాగు
- ప్రతీ ఇంట ఎర్రబంగారమే..
- చీడపీడల బెడద తక్కువ.. ఎకరానికి 30 క్వింటాళ్లకు తగ్గని దిగుబడి
- ధర సైతం ఆశాజనకంగా ఉండడంతో ఆనందంలో రైతులు





రైతులు కల్లంలో ఆరపెట్టిన మిర్చిపంట (ఇన్‌సెట్) చిమ్మపుడిలో సాగు చేసిన మిర్చితోట

రఘునాథపాలెం: ఆరుగాలం కష్టపడిన రైతులకు ఆ పంట దిగుబడి బాగుండి.. మంచి ధర పలికితే వారి కళ్లలో ఆనందమే వేరు. ఇప్పుడు అలాంటి ఆనందం రఘునాథపాలెం మండలంలోని కోటపాడులో మిర్చి సాగు చేసిన ప్రతీ రైతు ఇంట కనిపిస్తోంది. ఈ ఏడాది మిర్చి సాగులో నల్లి ఆశించి నష్టం జరగగా.. కోటపాడులో మాత్రం ఆ సమస్య ఎదురుకాలేదు. ఈ గ్రామానికి చెందిన 100 మందికి పైగా రైతులు మిర్చి సాగు చేయగా.. దాదాపు అందరూ 50 క్వింటాళ్లకు తగ్గకుండా, అత్యధికంగా 350 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధించారు. ఎక్కువ మంది రైతులు మల్చింగ్ విధానం పాటించడంతో ఆరంభంలో కాస్త ఖర్చు పెరిగినా డ్రిప్ వాడకం ద్వారా ఇతర ఖర్చులు కలిసొచ్చాయని చెబుతున్నారు.

**మంచి దిగుబడి, ధర..**

ఈ ఏడాది కోటపాడులో మిర్చి సాగు చేసిన రైతులు మంచి ఫలితాలు సాధించారు. దాదాపు అందరూ ఎకరానికి 30 నుంచి 35 క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చిందని చెబుతున్నారు. ఇదే సమయాన క్వింటాకు రూ.19 వేల నుంచి రూ.20 వేల వరకు ధర లభిస్తుండడంతో వారిలో హర్షం వ్యక్తమవుతోంది. కాగా, మిర్చి సాగు చేస్తే అందులో 20 నుంచి 30 శాతం మేర తాలుకాయలు ఉండేవి. ప్రధానంగా తెగుళ్లు, పురుగుల ప్రభావంతో ఇలా జరిగేది. కానీ ఈసారి తాలు కూడా తక్కువగా ఉండడంతో రైతులు లాభాల పంట పండించినట్లవుతోంది.

### ఆరు ఎకరాల్లో సాగుచేశా...



నాకు ఉన్న మూడెకరాలతో పాటు మరో మూడెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేశా. డ్రిప్ విధానం పాటించి ఇప్పటికే 125 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధించా. ఇంకా 70 క్వింటాళ్ల వరకు వస్తుందనే నమ్మకముంది. ఈ ఏడాది తెగుళ్ల ప్రభావం అంతగా లేకపోవడంతో మంచి దిగుబడి, అదే స్థాయిలో మంచి ధర వచ్చింది.

– వద్దే భాస్కరరావు, రైతు, కోటపాడు

### సాఫ్ట్‌వేర్ ఉద్యోగం.. సాగులో ఫలితం



కోటపాడుకు చెందిన కొంటెముక్కల ఉపేందర్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. వర్క్ ఫ్రం హోం విధానం అమల్లో ఉండడంతో తన తండ్రి, సోదరుడు సాగు చేస్తున్న సొంత పొలం పోను 15 ఎకరాలు కౌలుకు తీసుకున్నారు. ఇందులో ఐదెకరాల్లో పత్తితో పాటు మిగతా పది ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. పత్తి ఐదు ఎకరాలకు గాను సుమారు 70 నుంచి 72 క్వింటాళ్ల మేర దిగుబడి సాధించినట్లు ఆయన చెబుతున్నారు. ఇక 10 ఎకరాల్లో మిర్చి తోటలో ఇప్పటికే 110 క్వింటాళ్ల వరకు కోయగా.. ఇంకా 150 క్వింటాళ్లపైగా దిగుబడి వచ్చే అవకాశముందని చెబుతున్నారు.

### ఆరంభం నుంచే జాగ్రత్తలు



కోటపాడులో కొందరి మిర్చి తోటలు దెబ్బతిన్నా ఎక్కువ మంది రైతులు అధిక దిగుబడి సాధించారు. ఇందుకు ప్రధాన కారణం మొక్క నాటిన దగ్గరి నుంచే కాపాడుకుంటూ డ్రిప్ ద్వారా నీరు, ఎరువులు అందించారు. తద్వారా మంచి ఫలితాలు వచ్చాయి. అలాగే, ఇంకొన్ని గ్రామాల్లోనూ రైతులు మంచి దిగుబడి సాధించారు.

– ఇంటూరి భాస్కరరావు, ఏఓ

# చివరి ఆయకట్టుకూ నీరందాలి

నీటి పారుదల సలహా మండలి సమావేశంలో మంత్రి పువ్వాడ



మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పక్కన కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే వెంకటవీరయ్య

ఖమ్మంసహకారనగర్: నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి చివరి ఆయకట్టుకూ సాగు నీరందేలా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. స్థానిక ఐడీఓసీ సమావేశ మందిరంలో బుధవారం నీటిపారుదల, వ్యవసాయ, విద్యుత్ శాఖల అధికారులతో యాసంగి సీజన్‌లో సాగునీటి సరఫరాపై జిల్లా నీటిపారుదల సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నుంచి పాలేరు రిజర్వాయర్ లోకి ఇప్పటికి 19 టీఎంసీల నీరు వచ్చిందని తెలిపారు. గత యాసంగిలో 1.72 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా, అది ప్రస్తుతం 2.25 లక్షలకు పైగా పెరిగిందన్నారు. యాసంగికి సాగునీరు సరఫరా చేసేలా ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. నాగార్జున సాగర్‌లో తగినంత నీరు ఉందని, అవసరం మేరకు సరఫరా చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. నీటిపారుదల, వ్యవసాయ, విద్యుత్ శాఖల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. పాలేరు రిజర్వాయర్‌కు వచ్చిన నీరు దామాషా ప్రకారం సత్తుపల్లి చివరి ఆయకట్టు వరకు అందేలా చూడాలన్నారు. ఈ బాధ్యతను ఈఈ వెంకటేశ్వర రావు (9705877963)కు అప్పగించినట్లు మంత్రి తెలిపారు.

**సమన్వయ లోపంతో ఇబ్బందులు..**

జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ మాట్లాడుతూ అధికారుల మధ్య సమన్వయ లోపం వల్ల నీరు సమృద్ధిగా ఉన్నా.. రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మొత్తం ఆయకట్టును కాపాడాలని కోరారు. కలెక్టర్ వి.పి.గౌతమ్ మాట్లాడుతూ యూనిట్ అధికారిగా సీఈకి బాధ్యత ఉందన్నారు. ఆయనే జిల్లాను సమన్వయం చేయాలన్నారు. ఇంజనీర్లు కాల్వల వెంట తనిఖీలు చేస్తూ ఆందోళన చేస్తున్న రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ, నీటిపారుదల శాఖలో పెద్ద సంఖ్యలో సిబ్బంది ఉన్నారని, సమన్వయ లోపం తలెత్తకుండా చూడాలని కోరారు. సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ నీటి కేటాయింపుల్లో నాగార్జున సాగర్ ఒప్పంద రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. సాగర్ నుంచి వచ్చిన నీటిలో పై ప్రాంతాలకు ఎన్ని టీఎంసీలు, చివరి ఆయకట్టు ప్రాంతాలకు ఎన్ని టీఎంసీలు వాడారో తెలపాలని కోరారు. వారాబందీ దామాషా ప్రకారం చేపట్టడం లేదన్నారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర రావు, అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్, నీటిపారుదల శాఖ సీఈ శంకర్ నాయక్, డీఏఓ విజయనిర్మల, ట్రాన్స్‌కో ఎస్ఈ సురేందర్, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

# వరకట్న రహిత సమాజం ఏర్పడాలి

జిల్లా జడ్జి డాక్టర్ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసరావు

ఖమ్మంలీగల్: వరకట్న రహిత సమాజం ఏర్పడినప్పుడే మహిళలు విజయం సాధించినట్లని, అప్పుడే నిజమైన మహిళా దినోత్సవమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, దిశా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక టీటీడీసీలో బుధవారం నిర్వహించిన మహిళా న్యాయ చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. వరకట్నాన్ని వ్యతిరేకించడం అనేది మహిళ నుంచే ప్రారంభం కావాలన్నారు. ప్రతి మహిళ తన కుమారుడికి వరకట్నం తీసుకోనని ప్రతిన బూనితే, బిడ్డకు కూడా ఇవ్వాల్సిన అవసరం ఉండదని అభిప్రాయపడ్డారు. తన కుమారుడికి కట్నం ప్రసక్తి లేకుండా వివాహం చేస్తానని ప్రకటించారు. చదువు వల్ల విజ్ఞానం, మంచి ఆలోచనలు పెంపొందింపజేసుకోవాలని, కానీ ప్రస్తుత తరుణంలో అధిక కట్నం కోసం ఉన్నత చదువులు చదువుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్య ద్వారా మంచి విలువలను ఏర్పరచుకొని ఉత్తమ సమాజం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. వరకట్న దురాచారం వల్లే భ్రూణ హత్యలు పెరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ సీఈఓ రాజశేఖర్, జాతీయ బాల కార్మిక ప్రాజెక్టు అధికారి సాయి సంగీత, దిశా సంస్థ బాధ్యుడు జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**వివక్ష లేని సమాజాన్ని నిర్మిద్దాం**

వివక్ష లేని, ఆడా, మగ సమానంగా భావించే సమాజాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని జిల్లా జడ్జి శ్రీనివాసరావు అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొల్లపూడి రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారని కొనియాడారు. అందివచ్చిన అవకాశాలను ఉపయోగించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారని తెలిపారు. జిల్లా న్యాయస్థానంలో మహిళా జడ్జీలే అధికంగా ఉన్నారని, వారి ప్రతిభకు ఇదే నిదర్శనమని అన్నారు. అనంతరం మహిళా న్యాయమూర్తులను, న్యాయవాదులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు డానీరూత్, ఎస్.అమరావతి, న్యాయ సేవాధికారి సంస్థ న్యాయమూర్తి జావిద్ పాషా, శాంతి సోనీ, పొన్నపల్లి మౌనిక, రాళ్లబండి శాంతిలత, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# కేసీఆర్ పాలనలో మహిళలకు మహర్దశ



జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభిస్తున్న మంత్రి పువ్వాడ, ఎమ్మెల్సీ తాతా మధు, కలెక్టర్ గౌతమ్, మేయర్ నీరజ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: సీఎం కేసీఆర్ పాలనలోనే మహిళలకు మహర్దశ పట్టిందని, మహిళల సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కేక్ కట్ చేశారు. భక్త రామదాసు కళాక్షేత్రంలో బ్యాంక్ లింకేజ్ ద్వారా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ రహిత రుణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళల అభివృద్ధితోనే దేశ ప్రగతి, పురోగతి ఉంటుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా డ్వాక్రా సంఘాల బలోపేతం తెలంగాణలోనే జరిగిందన్నారు. ఆడ బిడ్డల కోసం రూ.750 కోట్ల నిధులను విడుదల చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రభుత్వానికి మహిళల తరుపున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వాలు స్వయం సహాయక సంఘాలకు 10 ఏళ్లలో రూ.21,978 కోట్లు మంజూరు చేస్తే.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వివిధ బ్యాంకుల ద్వారా రూ.66,624 కోట్లు మహిళా సంఘాలకు రుణాలుగా ఇప్పించినట్లు వివరించారు. అనంతరం పలువురు మహిళా అధికారులను సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాతా మధు, మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, కలెక్టర్ వి.పి. గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ దోరేపల్లి శ్వేత, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, డీఆర్‌డీఓ విద్యాచందన, జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారిణి సంధ్యారాణి, డీఎంహెచ్‌ఓ మాలతి, జెడ్పీటీసీ ప్రియాంక పాల్గొన్నారు.

# మహిళా కళాకారులను ప్రోత్సహించాలి

- కలెక్టర్ వీపీ గౌతమ్
- మహిళ సహనశీలి: నటి రాజ్యలక్ష్మి
- ఉర్రూతలూగించిన 'నెలనెలా వెన్నెల'



నటి రాజ్యలక్ష్మిని సత్కరిస్తున్న కలెక్టర్, సీపీ తదితరులు (ఇన్‌సెట్) నృత్యం చేస్తున్న కలెక్టర్ సతీమణి గౌతమి

ఖమ్మంగాంధీచౌక్: కళల గుమ్మం ఖమ్మం అని కలెక్టర్ వీపీ గౌతమ్ ప్రశంసించారు. ఇక్కడ మహిళా కళాకారులను ప్రోత్సహించాలని ఆకాంక్షించారు. బుధవారం రాత్రి భక్త రామదాసు కళాక్షేత్రంలో 'నెలనెలా వెన్నెల' ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఖమ్మం కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి వేల్పుల విజేత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. అనేక మంది మహిళల్లో భిన్నమైన కళలు దాగి ఉన్నాయని, వారు ముందుకు వచ్చి కళలను ప్రదర్శించాలని కోరారు. కార్యక్రమంలో సినీనటి, శంకరాభరణం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. సహనం, ఓర్పు, ఓపిక మహిళలకు మాత్రమే సొంతమని చెప్పారు. అనంతరం కలెక్టర్ సతీమణి గౌతమి కూచిపూడి నృత్యం అలరించింది. కార్యక్రమంలో సీపీ విష్ణుఎస్.వారియర్, కమిషనర్ ఆదర్శ్ సురభితో పాటు అధికారులు మధుసూదన్, విజయనిర్మల, విజయకుమారి, విద్యాచందన, మాలతితోపాటు పద్మావతి, నాగబత్తిని రవి, మోటమర్రి జగన్మోహన్‌రావు, ఏఎస్ కుమార్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ దంపతులు, రాజ్యలక్ష్మి, పలువురు మహిళా అధికారులు, కళాకారులను సన్మానించారు. అనంతరం నిర్వహించిన నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.


# పాఠశాలల్లో వసతులు కల్పించాలి

డీఈఓ సోమశేఖరశర్మ

ఖమ్మంసహకారనగర్: ప్రతి పాఠశాలలో అన్ని వసతులు కల్పించాలని డీఈఓ సోమశేఖరశర్మ అన్నారు. బుధవారం ఆయన ఖమ్మం అర్బన్ మండలంలోని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లతో రిక్కాబజార్ హైస్కూల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండో శనివారం, ఇతర సెలవు రోజుల్లో పాఠశాలలు నిర్వహించవద్దని సూచించారు. తరగతుల వారీగా ఫీజుల వివరాలను నోటీస్ బోర్డులో ప్రదర్శించాలని సూచించారు. స్కూల్ బ్యాగ్‌లు, పుస్తకాల బరువు, పాఠశాల విడిచి వెళ్లిన పిల్లలకు టీసీ, స్టడీ సర్టిఫికెట్ ఇవ్వడం తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎంఈఓ ఎం.శ్రీనివాస్, రిక్కాబజార్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నిధులతో పనులెలా..?

- వైరా రిజర్వాయర్ ఆధునికీకరణలో మీనమేషాలు
- ఈసారి రూ.49లక్షలు మంజూరు
- హెడ్ స్లూయిజ్‌ల వరకు మరమ్మతులకే సరి
- మిగతా పనులపై ఏటా ప్రతిపాదనలకే పరిమితం..



వైరా రిజర్వాయర్ కుడి కాల్వ పై శిథిలావస్థకు చేరిన హెడ్ స్లూయిజ్ (లాక్)

వైరా: జిల్లాలో మధ్యతరహా తాగునీటి ప్రాజెక్టు అయిన వైరా రిజర్వాయర్ ఆధునీకరణకు అడుగులు చురగ్గా పడడం లేదు. ఏటా నీటి పారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించడం.. ఆ మేరకు నిధులు రాకపోవడం ఆనవాయితీగా మారుతోంది. గత నాలుగేళ్ల క్రితం ఓసారి బడ్జెట్‌లో నిధులు కేటాయించినా మంజూరు కాలేదు. దీంతో జిల్లాలోనే నీటి పారుదల వ్యవస్థకు తలమానికంగా నిలిచే వైరా రిజర్వాయర్ ఆధునికీకరణకు మోక్షం లభించడం లేదు. దీంతో వచ్చే అరకొర నిధులు వెచ్చించి అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారు.

**రిజర్వాయర్ స్వరూపం ఇలా..**

వైరా రిజర్వాయర్ నిర్మించి 95 ఏళ్లకు పైగా గడిచింది. కానీ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో మంజూరైన రూ.50 కోట్ల నిధులు మినహా ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో నిధులు రాలేదు. రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వల పరిధిలో సుమారు 30 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఎనిమిది వేల మంది రైతులు దీనిపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. ఏటా చివరి భూములకు నీరందే పరిస్థితి లేకపోవడంతో ఆయకట్టు పరిధిలో రైతులు గగ్గోలు పెడుతున్నా సమస్యకు పరిష్కారం దొరకడం లేదు.

**ప్రస్తుతానికి రెండు స్లూయిజ్‌లు..**

ఇటీవల ఎమ్మెల్యే లావుడియా రాములునాయక్ చేసిన ప్రతిపాదనల మేరకు రూ.49 లక్షలు మంజూరయ్యాయి. వీటితో రెండు హెడ్ స్లూయిజ్‌లు నిర్మించనున్నారు. ఎడమ కాల్వ పరిధిలో రెడ్డిగూడెం వద్ద, కుడి కాల్వ పరిధిలో వైరా రిజర్వాయర్‌కు వెళ్లే ప్రధాన రహదారి సమీపాన హెడ్ స్లూయిజ్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఏటా జూలై నుంచి ఆగస్టు వరకు రిజర్వాయర్ కాల్వలకు నీరు విడుదల చేసే సమయాన స్లూయిజ్(లాక్‌లు)లు సక్రమంగా పని చేయకపోవడంతో ఇబ్బందిగా మారేది. ప్రస్తుతం వీటి నిర్మాణంతో ఆ ఇబ్బందులు తొలగిపోతాయి. మే మొదటి వారంలో రెండు స్లూయిజ్‌ల వద్ద విడివిడిగా రింగ్ బండలు ఏర్పాటుచేసి నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు ఐబీ అధికారులు తెలిపారు.

### మరి వీటికెప్పుడు..?

రిజర్వాయర్ ఆయకట్టులోని కుడి, ఎడమ కాల్వల పరిధిలో చాలా చోట్ల తూములు శిథిలావస్థకు చేరాయి. ఫలితంగా కాల్వలో పారే నీరు ఇంకిపోవడం, లీక్ కావడం సర్వసాధారణమైంది. వీటిని కూల్చివేసి కొత్తవాటిని నిర్మించాలంటూ ప్రతిపాదనలు చేసినా నిధులు మంజూరు కావడం లేదు. ప్రధానంగా ఎడమ కాల్వ పరిధిలో పినపాక, సిరిపురం, గొండ్లపాలెం, నారపునేనిపల్లి, గరికపాడు గ్రామాల్లోని 2, 4, 5, 9, 10, 12, 17 నంబర్ తూములు పూర్తిగా కూలిపోయాయి. ఇక కుడి కాల్వ పరిధిలో వైరా, తాటిపూడి, పాలడు గు, రాపల్లె పరిధిలోని 6, 6(సీ), 12, 28 నంబర్ తూములను నిర్మించాల్సి ఉంది. వీటికి కూడా ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు.

### ప్రతిపాదనలు పంపించాం

రిజర్వాయర్ ఆధునికీకరణకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రస్తుతానికి స్లూయిజ్‌ల నిర్మాణానికి రూ.49 లక్షలు మంజూరయ్యాయి. మే మొదటి వారంలో కాల్వలో నీరు నిలిపివేసి రింగ్ బండ్‌లు ఏర్పాటు చేసి పనులు చేపడుతాం. మిగిలిన పనులకు నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం.

– శ్రీనివాస్, డీఈ

## క్లుప్తంగా

### విజయ కళాశాలలో 'టాస్క్' శిక్షణ


ద్యార్థులకు శిక్షణ ఇస్తున్న అశోక్‌నాయక్

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల సమీపంలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్, నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో ఫ్రంట్, టెక్నాలజీస్‌పై మూడు రోజుల శిక్షణను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ జి.జాన్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా టాస్క్ ప్రతినిధి అశోక్‌నాయక్ కంప్యూటర్ విద్యకు సంబంధించిన పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో ట్రెనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

### బ్యాంక్ ఖాతాలో రూ.4.94 లక్షలు మాయం

ఖమ్మంరూరల్: మండలంలోని శ్రీసిటీకి చెందిన మహ్మద్ తాజుద్దీన్‌కు చెందిన బ్యాంక్ ఖాతా నుంచి రూ.4.94 లక్షలు సైబర్ దుండగులు ఖాజేశారు. ఈ ఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఉద్యోగ విరమణ పొందిన తాజుద్దీన్‌కు ఈ నెల 5న ఓ ఫోన్ నంబర్ నుంచి మెసేజ్ వచ్చింది. మెసేజ్ ఓపెన్ చేసి లాగిన్ కావడంతో ఖాతా నుంచి రూ.4.94 లక్షలు మాయం అయ్యాయి. తాను మోసపోయినట్లు గుర్తించి బుధవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

### అతివేగం.. పలువురికి గాయాలు

నేలకొండపల్లి: మద్యం మత్తులో అతివేగంగా ఆటో నడిపించడంతో అందులోని ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. ఖమ్మం నుంచి కోదాడకు ఆటోలో ప్రయాణికులకు ఎక్కించుకుని మద్యం సేవించిన డ్రైవర్ వేగంగా పోనిస్తున్నాడు. ఈ క్రమంలో ఆటో కుదుపునకు లోనవడంతో దేవదాసు అనే ప్రయాణికుడికి ఆటో టాప్‌లో ఉన్న ఇనుప చువ్వలు తగిలాయి. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. ఇదిలా ఉండగా ఆటో వేగంగా నడపడం వల్ల గువ్వలగూడెం గ్రామం వద్ద ప్రయాణికులు వస్తువులు సైతం కిందపడగా ఆటో ఆపకుండా తీసుకొచ్చాడు. ఈ క్రమంలో ప్రయాణికులు ఆటోడ్రైవర్‌తో వాగ్వాదానికి దిగి తిరిగి గువ్వలగూడెం వైపు ఆటోను తీసుకెళ్లారు.

### ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మంరూరల్: మండలంలోని రాజీవ్‌గృహకల్పకు చెందిన గంట సైదులు (30) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఇల్లెందు మేదరబస్తీకి చెందిన సైదులు కొంతకాలంగా రాజీవ్‌గృహకల్పలో భార్యతో కలిసి అద్దెకుంటూ కూలి పనులకు వెళ్తున్నాడు. ఈ నెల 5న భార్యతో కలిసి బెల్లంపల్లి వెళ్లాడు. మరుసటి రోజు భార్యను అక్కడే ఉంచి తిరిగి ఇంటికి వచ్చాడు. మద్యానికి బానిసైన ఆయన భార్యతో ఉన్న మనస్పర్థలతో మనస్తాపం చెంది ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహం దుర్వాసన రావడంతో రెండు రోజుల కిందటే ఉరివేసుకొని ఉండవచ్చని చుట్టుపక్కలవారు తెలి పారు. అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.



# ఆగిన గుండె మళ్లీ పనిచేసేలా..

### సీపీఆర్‌తో బాధితుల ప్రాణాలు నిలబెట్టొచ్చు..

- ఇటీవల పెరిగిన గుండెపోటు మరణాలు..
- అప్రమత్తమై డాక్టర్లకు శిక్షణ ఇస్తున్న వైద్యశాఖ
- త్వరలో సిబ్బందికి, ఆ తర్వాత ఇతర శాఖల్లోనూ తర్ఫీదు

చుంచుపల్లి: కరోనా మహమ్మారి ప్రభావం తగ్గిన తర్వాత ఇటీవల కాలంలో కార్డియాక్ అరెస్ట్, అకస్మాత్తుగా గుండెపోటు మరణాలు పెరుగుతున్నాయి. యుక్త వయసులో ఉన్నవారు, చిన్నారులు కూడా మృత్యువాత పడుతున్నారు. వరుస గుండెపోటు మృతుల ఘటనలు జిల్లా ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమై గుండెపోటు సంఘటనల పట్ల జాగ్రత్తగా ఉండాలని, సీపీఆర్ చేసే విధానంపై దృష్టి సారించాలని వైద్యశాఖకు ఆదేశాలు జారీ చేసింది. గుండెపోటు వచ్చిన వ్యక్తులకు వైద్యం అందేలోపు సీపీఆర్ ప్రక్రియ నిర్వహిస్తే ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే జిల్లాకు చెందిన ఐదుగురు వైద్యులకు వైద్యశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మాస్టర్ ట్రైనర్లుగా ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వారు జిల్లాలోని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి ఈ నెల 13 తర్వాత శిక్షణ ఇచ్చేందుకు జిల్లా వైద్యశాఖ సన్నాహాలు చేస్తోంది. ఆ తరువాత మున్సిపల్, పోలీస్, రెవెన్యూతోపాటు ఇతరశాఖల సిబ్బందికి దఫాలుగా శిక్షణ అందించనున్నారు.

#### ఇటీవల చోటుచేసుకున్న కొన్ని ఘటనలు

- చుంచుపల్లి మండలం రామాంజనేయకాలనీకి చెందిన 39 ఏళ్ల మహిళకు జనవరి 22న రాత్రి గుండెపోటు రాగా కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ప్రాణాలు వదిలింది.
- కొత్తగూడెం శ్రీనగర్‌లో నివాసం ఉండే 50 ఏళ్ల సీనియర్ పాత్రికేయుడికి జనవరి 23న తెల్లవారుజామున అకస్మాత్తుగా గుండెనొప్పి రావడంతో మొదట పలు ఆస్పత్రులకు వెళ్లారు. అక్కడ డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించేలోపే ప్రాణాలు వదిలాడు.
- దుమ్ముగూడెం మండలం రామారావుపేటకు చెందిన ఎంటెక్ విద్యార్థి పర్సా కళ్యాణ్(25) ఆదివారం ఉదయం తండ్రితో కలిసి పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ అకస్మాత్తుగా గుండెనొప్పి రావడంతో కుప్పకూలాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.



#### సీపీఆర్ ఎలా చేయాలంటే..

బాధితుడిని బల్లపరుపు స్థలంలో పడుకోబెట్టాలి. ఎడమ చేయి వేళ్ల మధ్య కుడి చేయి వేళ్లు లేదా కుడిచేయి వేళ్ల మధ్య ఎడమచేతి వేళ్లు జొప్పించి బాధితుడి ఛాతి(గుండెపై కాదు) మధ్య భాగంలో నొక్కాలి. క్రమంగా ప్రెస్ చేస్తూ ఉండాలి. నొక్కేటప్పుడు మన చేతులు, మోచేతులు అసలు బెండ్ కాకూడదు. చేతులు స్టిఫ్‌గా ఉంచి నొక్కాలి. బాధితుడి ఛాతి కనీసం 5 సెంటీమీటర్లు లోతుకు వెళ్లేలా నొక్కాలి. ఎముకలు విరిగిపోతాయని భయపడకూడదు. నిమిషానికి వంద సార్లు, అంతకంటే ఎక్కువగా చేయాలి. అలా ఒక నిమిషం వరకు ప్రెస్ చేశాక పల్స్ చెక్ చేయాలి. పల్స్ దొరకకపోతే మళ్లీ ఆ ప్రక్రియ కొనసాగించాలి. ఇలా ఒక్కోసారి 20–30 నిమిషాల వరకు చేస్తూనే ఉండాలి. కంటిన్యూయస్‌గా చేస్తున్నప్పుడు గుండె మళ్లీ కొట్టుకునే అవకాశం ఉంటుంది. హార్ట్ ఎటాక్ వచ్చిన వెంటనే సీపీఆర్ చేస్తే ప్రయోజనం ఉంటుంది. చాలా ఆలస్యం చేస్తే లాభం ఉండదు.

#### ప్రాణం పోసేలా..

సీపీఆర్.. కార్డియో పల్మనరీ రీససిటేషన్. గుండె పనితీరు అకస్మాత్తుగా ఆగిపోయేటప్పుడు, ఆగిపోయిన వారికి వెంటనే పంప్ చేసేందుకు ఈ ప్రక్రియను చేపడతారు. సీపీఆర్ చేసేటప్పుడు బాధితుడిని బల్లపరుపుగా ఉన్న స్థలంలో పడుకోబెట్టాలి. రెస్పాండ్ అయితే మీరు ఏం చేయాల్సిన అవసరం లేదు. రెస్పాండ్ కాకపోతే తక్షణమే పల్స్ చూడాలి. మేజర్ హార్ట్ ఎటాక్ అయితే పల్స్ దొరకదు. అప్పుడు మెడ దగ్గర పల్స్‌ను చూడాలి. అక్కడ కూడా పల్స్ దొరకలేదంటే హార్ట్ ఆగిపోయినట్టు గుర్తించాలి. ఆగిపోయిన గుండె తిరిగి పనిచేసేలా ఈ విధానంతో చేయొచ్చు.

ఇవి చేస్తూనే ప్రభుత్వ 108 వాహనానికి లేదా ప్రైవేట్ ఆస్పత్రుల అంబులెన్స్‌లకు సమాచారం ఇవ్వాలి.

#### 13 తర్వాత వైద్య సిబ్బందికి శిక్షణ



ప్రభుత్వం గుండెపోటు మరణాల విషయంలో వైద్యశాఖను అప్రమత్తం చేసింది. ప్రజలకు సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించాలని సూచించింది. ఇప్పటికే జిల్లాకు చెందిన ఐదుగురు వైద్యులు మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణ పొందారు. ఈనెల13 తర్వాత వారు జిల్లాలోని వైద్య సిబ్బందికి శిక్షణ ఇస్తారు. ఆ తర్వాత అన్ని ప్రభుత్వ శాఖలకు దఫాలుగా తర్ఫీదు ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తాం. –డాక్టర్ జీవీఎల్ శిరీష, డీఎంహెచ్‌ఓ

#### అవగాహన పెంచుకోవాలి



గుండెపోటు వచ్చిన సందర్భంలో సీపీఆర్ ప్రక్రియ అనేది చాలా ప్రధానమైనది. గుండెపోటు వచ్చిన వ్యక్తికి ఆలస్యం చేయకుండా వెంటనే చేతులతో కొన్ని నిమిషాలపాటు ప్రెస్సింగ్ చేస్తే తిరిగి గుండె పని చేస్తుంది. ఈ ప్రక్రియ ద్వారా మనిషి ప్రాణాలను తిరిగి నిలబెట్టవచ్చు. దీనిపై అందరూ అవగాహన పెంచుకోవాలి. – డాక్టర్ ఎ.పుష్పలత, ఎండీ జనరల్ ఫిజీషియన్, జిల్లా సర్వజన ఆస్పత్రి

### విశిష్ట సేవలకు పురస్కారం

- కేయూలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం


గుండు రాజకుమారి, భరోసా కేంద్రం కోఆర్డినేటర్ (ఖమ్మం)


అల్పై కిడగెన్, సోషల్ వర్కర్ (ఖమ్మం)

కేయూక్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం, మహిళా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీలోని ఆడిటోరియంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్ రావు, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మేయర్ సుధారాణి, మహిళా శిశు సంక్షేమశాఖ కమిషనర్ భారతిహోళికేరీ, కలెక్టర్ సిక్తా పట్నాయక్ తదితరులు హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాల్లో విశిష్టసేవలు అందించిన 27 మంది మహిళలకు అవార్డులు అందజేశారు. రూ.లక్ష నగదుతోపాటు ప్రశంసాపత్రం అందించారు.

### ముగ్గురిపై వీధి కుక్క దాడి

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం వీధి కుక్కలు ముగ్గురు వ్యక్తులపై దాడి చేసి గాయపర్చాయి. మండలంలోని మండ్రాజుపల్లికి చెందిన లక్ష్మీపార్వతి, లలిత పని మీద బయటకు రాగానే ఒక్కసారిగా కుక్కలు దాడి చేశాయి. దీంతో వారిరువురూ తీవ్రంగా గాయపడ్డారు. నేలకొండపల్లికి చెందిన సైదులు (9)పై దాడి చేసి గాయపరిచాయి. ముగ్గురు కూడా నేలకొండపల్లి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స తీసుకున్నారు. కాగా, గ్రామాల్లో కుక్కల దాడులు పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### ఆన్‌లైన్ మోసం

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన గుర్రం బుచ్చిబాబు ఆన్‌లైన్ యాప్ ద్వారా రూ.3 వేల విలువైన వస్తువులు ఇటీవల కొనుగోలు చేశాడు. కొనుగోలుకు సంబంధించి యూపీఐ ద్వారా నగదు చెల్లించాడు. యూపీఐ చెల్లింపులో సమస్య ఏర్పడిందని తాము పంపిన లింక్ ద్వారా నగదును చెల్లించాలని గుర్తు తెలియని వ్యక్తులు బుచ్చిబాబుకు సూచించారు. ఆ యూపీఐ లింక్ ఓపెన్ చేసి పాస్‌వర్డ్ ఎంటర్ చేసిన కొద్దిసేపటికే తన బ్యాంకు ఖాతాలో నిల్వ ఉన్న రూ.96 వేలు మరో ఖాతాకు బదిలీ అయినట్లు బుచ్చిబాబు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. మోసానికి గురైనట్లు భావించిన బుచ్చిబాబు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గుండెపోటుతో పిండిప్రోలు సర్పంచ్ హఠాన్మరణం

- మూడు పర్యాయాలు సర్పంచ్‌గా, ఎంపీటీసీగా ఒకసారి..
- ప్రజల మనిషిగా పేరు తెచ్చుకున్న ప్రజాపంథా నేత


రాయల నాగేశ్వరరావు (ఫైల్)

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు గ్రామసర్పంచ్ రాయల నాగేశ్వరరావు (74) గుండెపోటుతో బుధవారం మృతిచెందారు. ఇంట్లోనే ప్రజలతో మాట్లాడిన అనంతరం ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు ఖమ్మం తరలించగా నాగేశ్వరరావు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రాయల సుభాష్‌చంద్రబోస్‌కి సోదరుడైన నాగేశ్వరరావు 1973 నుంచి సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ(ప్రస్తుతం ప్రజాపంథా) పార్టీ కార్యకర్తగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందారు. మూడు పర్యాయాలు సర్పంచ్‌గా, ఒకసారి ఎంపీటీసీ సభ్యుడిగా సేవలు అందించారు. రాయల నాగేశ్వరరావుకి భార్య హైమావతి కుమారుడు రాజా, కుమార్తె వనజ ఉన్నారు. మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, పోటు రంగారావు, గోకినపల్లి వెంకటేశ్వరరావు, రాయల చంద్రశేఖర్, పుసులూరి నరేందర్, గుర్రం అచ్చయ్య, కమ్మకోమటి నాగేశ్వరరావు, శిరోమణి, ఝాన్సీ, లక్ష్మి, సి.వై.పుల్లయ్య, జి.రామయ్య, రాయల రవికుమార్, పోతినేని సుదర్శన్‌రావు, పొన్నం వెంకటేశ్వర్లు, నున్నా నాగేశ్వరరావు, కొమ్ము శ్రీను, బాగం హేమంతరావు, చావా వేణు, మందుల రాజేంద్రప్రసాద్, గొర్రెపాటి రమేశ్, తుళ్లూరి కోటేశ్వరరావు, నామ కృష్ణయ్య, మద్ది శ్రీనివాసరెడ్డి, తమిర వెంకటరెడ్డి నివాళులర్పించారు. కాగా, గురువారం ఉదయం 10 గంటలకు పిండిప్రోలులో నాగేశ్వరరావు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ప్రజాపంథా మండల నాయకులు ఎడ్లపల్లి నవీన్ తెలిపారు.


నివాళులర్పిస్తున్న పోటు రంగారావు తదితరులు

**ఎంపీ నామ సంతాపం**

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా సీనియర్ నాయకులు, పిండిప్రోలు సర్పంచ్ రాయల నాగేశ్వరరావు మృతికి బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. నిత్యం ప్రజలతో కలిసి మెలిసి ఉండేవారని పేర్కొన్నారు.

## మద్యం మత్తులో స్నేహితుల మధ్య ఘర్షణ

**ఇద్దరికి కత్తిపోట్లు**

ఖమ్మంక్రైం: మద్యం మత్తులో స్నేహితుల మధ్య ఘర్షణ చిలికిచిలికి గాలివానలా మారింది. ఇద్దరికి కత్తి పోట్లు దిగాయి. ఈ ఘటన ఖమ్మం టూటౌన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కవిరాజ్‌నగర్‌కు చెందిన కిలారు రమేశ్ ఫర్నిచర్ దుకాణంలో సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అదే దుకాణంలో పనిచేస్తున్న రాము, కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న అనబోతు నాగేశ్వరరావు, రమేశ్ ముగ్గురూ స్నేహితులు. వీరు ఈ నెల 7వ తేదీ రాత్రి ఓ మద్యం దుకాణంలో మద్యం సేవించారు. ఈ క్రమంలో రమేశ్‌కు, నాగేశ్వరరావుకు మధ్య చిన్న ఘర్షణ తలెత్తింది. అది కాస్తా పెద్దదైంది. వారిని రాము వారించి బయటకు తీసుకొచ్చాడు. అదే సమయంలో రమేశ్ బంధువు దొడ్డపునేని ఉదయ్‌కిరణ్ రాగా జరిగిన గొడవంతా చెప్పారు. అనంతరం రాము నాగేశ్వరరావుని వీడీవోస్‌కాలనీలో దింపి వచ్చాడు. తర్వాత ఉదయ్‌కిరణ్, రాముని తీసుకొని నాగేశ్వరరావు ఇంటికి రమేశ్ వెళ్లాడు. అక్కడ మళ్లీ వాగ్వాదం నడిచింది. దీంతో నాగేశ్వరరావు కత్తి తీసుకొని వచ్చి రమేశ్‌ను పొడవగా అడ్డుకోపోయిన ఉదయ్‌కిరణ్‌ను కూడా పొడిచాడు. తీవ్రగాయాల పాలైన ఉదయ్‌కిరణ్ అక్కడే పడిపోగా రమేశ్, రాము నాగేశ్వరరావు నుంచి తప్పించుకొని పారిపోయారు. ఉదయ్‌కిరణ్‌ను అతని బంధువు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. రమేశ్ ఫిర్యాదు మేరకు సీఐ శ్రీధర్ నాగేశ్వరరావుపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పేకాట స్థావరంపై పోలీసుల దాడి

వేంసూరు: మండలంలోని కుంచపర్తి గ్రామ శివారు, ఆంధ్రా సరిహద్దు ప్రాంతంలోని పేకాట స్థావరంపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 8 మంది వ్యక్తులు, 4 సెల్‌పోన్లు, 27 ద్విచక్ర వాహనాలు, సుమారు రూ.1,73,800 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమెదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వేంసూరు మండలం ఆంధ్రా సరిహద్దు కావడంతో చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భారీ స్థాయిలో జూదరులు మూడు నెలలుగా పేకాట స్థావరం నిర్వహిస్తున్నట్లు తెలిసింది.





## మహిళలకు అందలం..

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేసిందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. భక్త రామదాసు కళాక్షేత్రంలో బ్యాంక్ లింకేజీ ద్వారా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ రహిత రుణాలను పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, పలు రంగాల్లో ఉన్నత స్థానంలో ఉన్న పలువురు మహిళలను సత్కరించారు.


మేయర్ నీరజను సన్మానిస్తున్న మంత్రి పువ్వాడ, జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, ఎమ్మెల్సీ మధుసూదన్, కలెక్టర్ గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్


ఏఎంసీ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేతను సన్మానిస్తున్న దృశ్యం


డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా


ట్రాఫిక్ సీఐ అంజలి


డీఆర్‌డీఓ విద్యాచందనను సన్మానిస్తున్న మంత్రి పువ్వాడ, మేయర్ నీరజ, జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్


సంక్షేమాధికారిణి సంధ్యారాణి


ఖమ్మం తహసీల్దార్ శ్రీలత


రఘునాథపాలెం జెడ్పీటీసీ సభ్యురాలు ప్రియాంక


దీఈ నవ్యజ్యోతి


డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ విష్ణువందన


డాక్టర్ సమత


కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి

## క్లుప్తంగా...

### విశాఖలో ప్రతిష్టాత్మక ఐసీఐడీ 25వ కాంగ్రెస్

- 75వ ఐఈసీ సమావేశం కూడా...
- నవంబర్ 1 నుంచి 8 వరకు ఏపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహణ

సాక్షి, అమరావతి: ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ (ఐసీఐడీ) 25వ కాంగ్రెస్‌కు విశాఖపట్నంను వేదికగా ఆ సంస్థ ఎంపిక చేసింది. నవంబర్ 1 నుంచి 8 వరకు ఈ సమావేశాలను ఏపీ ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఇందులో భాగంగానే ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఐఈసీ) 75వ సమావేశాన్ని కూడా ఐసీఐడీ నిర్వహిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా వ్యవసాయంలో నీటి ఎద్దడిని సమర్థంగా ఎదుర్కోవడమే ఈ కాంగ్రెస్ ప్రధానాజెండా. ఆస్ట్రేలియాలోని అడిలైడ్‌లో గత అక్టోబర్ 3 నుంచి 10 వరకు ఐసీఐడీ 24వ కాంగ్రెస్, 74వ ఐఈసీ సమావేశాలు జరిగాయి. ఐసీఐడీ 25వ కాంగ్రెస్‌ను మన రాష్ట్రంలోని విశాఖపట్నంలో నిర్వహించాలని ఆ సంస్థ నిర్ణయించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ కాంగ్రెస్‌ను ఘనంగా నిర్వహిస్తామని రాష్ట్ర ప్రతినిధి బృందం అడిలైడ్ కాంగ్రెస్‌లో తెలిపింది. విశాఖ కాంగ్రెస్‌కు హాజరుకావాలని 78 దేశాల ప్రతినిధులు, శాస్త్రవేత్తలను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆహ్వానించింది. వ్యవసాయంలో నీటి ఎద్దడిని సమర్థవంతంగా ఎదుర్కొనే విధానాలను ప్రతిపాదిస్తూ నివేదికలను ఏప్రిల్ 30 లోపు పంపాలని ఆ సంస్థ పేర్కొంది. ఇందులో అత్యుత్తమ విధానాలపై 25వ కాంగ్రెస్‌లో చర్చించనుంది.

### మే 15 నుంచి ఏపీఈఏపీసెట్

ఈసెట్ మే 5న, ఐసెట్ మే 24 నుంచి నిర్వహణ

సాక్షి, అమరావతి: ఏపీలో 2023–24 విద్యా సంవత్సరంలో కీలకమైన ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన ఎంట్రన్స్ టెస్టుల షెడ్యూల్‌ను ఏపీ ఉన్నత విద్యా మండలి ఖరారు చేసింది. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏపీ ఈఏపీసెట్ (ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్), లేటరల్ ఎంట్రీ (డిప్లొమా విద్యార్థులు ఇంజనీరింగ్ రెండో ఏడాదిలో ప్రవేశం)కి సంబంధించిన ఈసెట్, ఎంసీఏ, ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశం కోసం ఐసెట్ నోటిఫికేషన్, ఆన్‌లైన్‌లో దరఖాస్తు, పరీక్షల నిర్వహణ తేదీలను నిర్ణయించింది. ఈ మేరకు షెడ్యూల్ వివరాలను ఉన్నత విద్యా మండలి బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈఏపీసెట్ పరీక్షలను మే 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఈసెట్ మే 5న, ఐసెట్ మే 24, 25 తేదీల్లో నిర్వహిస్తారు.

# బొబ్బిలి వీణ.. శిఖరాగ్ర ఆదరణ

- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు హాజరైన అతిథులకూ ఇవే బహుమతి
- రాష్ట్రపతి భవన్ నుంచి.. వైట్‌హౌస్ వరకు బొబ్బిలి వీణలకు స్థానం
- 300 ఏళ్లనాటి చారిత్రక సంపదగా జియోగ్రాఫికల్ గుర్తింపు దక్కించుకున్న బొబ్బిలి వీణ

**జీ-20 దేశాల అతిథుల కోసం 200 వీణలకు ఆర్డర్**

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ప్రపంచంలో ప్రతిష్టాత్మకమైన 20 సభ్యదేశాల శిఖరాగ్ర సమావేశాల్లో బొబ్బిలి వీణ వైభవాన్ని చాటుకోనుంది. విశాఖలో ఈ నెల 28, 29వ తేదీల్లో జరగనున్న జీ-20 సదస్సుకు వివిధ దేశాల నుంచి హాజరయ్యే అతిథులను గౌరవించేందుకు 200 బొబ్బిలి వీణలను అధికారులు ప్రత్యేకంగా తయారు చేయిస్తున్నారు. కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరయ్యే అవకాశం ఉన్నందున ఆయన చేతుల మీదుగా వీటిని ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే అతిథులకు అందించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. విశాఖలో ఈ నెల 3, 4 తేదీల్లో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు దేశం నలుమూలల నుంచి హాజరైన పారిశ్రామిక దిగ్గజాలు, ఔత్సాహికులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున బొబ్బిలి వీణలను బహూకరించారు. బొబ్బిలి పట్టణ పరిధిలోని గొల్లపల్లికి చెందిన సర్వసిద్ధి ఇంటిపేరు గల కుటుంబీకులే దశాబ్దాలుగా బొబ్బిలి వీణలను తయారుచేస్తూ వస్తున్నారు. వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ద్వారా 1994వ సంవత్సరంలో సొసైటీని ఏర్పాటు చేసింది. 2002లో బొబ్బిలి పట్టణ పరిధిలోని గొల్లపల్లిలో వీణల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది.

**ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది**

వీణల తయారీయే ఆధారంగా ఉన్న మా కళాకారులకు టీటీడీతో పాటు ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు సందర్భంలో 200 వీణలను తయారుచేసి అందించాం. అతిథుల కోసం మా వీణలతో కచేరీ కూడా ఏర్పాటు చేయించారు. ఈ నెలలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రానున్న మరో ప్రతిష్టాత్మక సదస్సు జీ-20 కోసం కూడా 200 వీణలకు ఆర్డర్ వచ్చింది.

– సర్వసిద్ధి రామకృష్ణ, ఇన్‌చార్జి, బొబ్బిలి వీణల కేంద్రం



**వీణల ధరలు ఇలా..**

| వీణ సైజు (అంగుళాల్లో) | రకం | ధర | ప్యాకింగ్‌తో ధర |
|---|---|---|---|
| 9 | సాధారణ | రూ.1,200 | రూ.1,430 |
| 13 | సాధారణ | రూ.1,900 | రూ.2,300 |
| 17 | సాధారణ | రూ.2,200 | రూ.2,700 |
| 23 | సాధారణ | రూ.3,600 | రూ.4,500 |
| 9 | నెమలి | రూ.1,800 | రూ.2,200 |
| 17 | నెమలి | రూ.2,900 | రూ.3600 |
| 9 | స్వరమాపది | రూ.2,000 | రూ.2,500 |
| పెద్దవీణ | (సరస్వతివీణ) | రూ.32,000 | -- |

## నిధులు పెంచండి... నివేదికలివ్వండి

▶ మొదటి పేజీ తరువాయి

దృష్టి పెట్టాలని జిల్లా అధికారులు ఆదేశాలు వెళ్లాయి. మార్కులు తక్కువ వస్తున్న విద్యార్థులను మానసికంగా వేధించడం, ఇతర కాలేజీల నుంచి పరీక్షలు రాయించే చర్యలపైనా ఫిర్యాదులున్నాయి. వాటిని పరిశీలించాలని బోర్డు ఆదేశించింది.

**వాటిపై మరింత దృష్టి..**

- అకాడమీల పేరుతో విద్యార్థులను చేర్చుకోవడం బోర్డు నిబంధనలకు విరుద్ధమైనప్పటికీ కొన్ని కాలేజీలు ఆయా విద్యార్థులను ఇతర కాలేజీల పేరిట పరీక్షలు రాయిస్తున్నట్లు వెల్లడైంది. దీంతో ఏ కాలేజీ ద్వారా ఏ అకాడమీ విద్యార్థుల చేత పరీక్షలు రాయిస్తున్నారనే వివరాలను అధికారులు సేకరిస్తున్నారు.
- చాలా ప్రైవేటు కాలేజీలపై గతంలో అవకతవకల ఆరోపణలు వచ్చినా చర్యలు తీసుకోకుండా అడ్డుకున్న అధికారులెవరు? వారికి సహరించిన యాజమాన్యాలు, వ్యక్తులు ఎవరు? ఈ తంతులో ఎంత మేర ముడుపులు చేతులు మారాయి? అనే వివరాలనూ తెలుసుకుంటున్నారు.
- కొన్నేళ్లుగా కొందరు బోర్డు అధికారులు, కొన్ని కాలేజీల యాజమాన్యాల మధ్య మధ్యవర్తిత్వం వహించిన వారి ప్రమేయం, సాగించిన అవినీతి కార్యకలాపాలపై సమగ్ర నివేదికను రూపొందిస్తున్నారు.

**కఠిన చర్యలు తీసుకోవాలి..**



విద్యార్థులకు నష్టం కలిగించే కాలేజీలపై కొరడా ఝుళిపించాలి. ర్యాంకుల కోసం విద్యార్థులను వేధిస్తున్న, నిబంధనలను అతిక్రమిస్తున్న కాలేజీలపై కఠిన చర్యల విషయంలో బోర్డు చిత్తశుద్ధితో వ్యవహరించాలి.

– గౌరీ సతీశ్ (ప్రైవేటు కాలేజీల యాజమాన్య సంఘం అధ్యక్షుడు)

**అవినీతి అధికారులను తొలగించాలి**



విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తూ ర్యాంకులతో ప్రచారం చేసుకుంటున్న కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల ఆగడాల వెనుక కొందరు బోర్డు అధికారుల ప్రమేయం ఉంది. అవినీతికి పాల్పడుతూ ఆయా సంస్థలను వెనకేసుకొచ్చిన అధికారులను గుర్తించి తొలగించాలి.

– మాచర్ల రామకృష్ణగౌడ్ (తెలంగాణ ఇంటర్ విద్య పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్)

## ఒకే విడతలో 1.34 లక్షల ఉద్యోగాలిచ్చిన ప్రభుత్వమిది

- ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాల్లో పాల్గొనం
- ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: 'ఏపీలో రికార్డు స్థాయిలో ఒకే విడతలో తమలాంటి 1.34 లక్షల మందికి కొత్తగా ఉద్యోగాలిచ్చిన ప్రభుత్వం ఇది. ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే నిరసనలు, ఆందోళనల్లో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులం పాల్గొనం'అని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ స్పష్టంచేసింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానిపాషా బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే ఎవరూ ఊహించని విధంగా చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో బృహత్తర ఆలోచనతో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి 1.34 లక్షల మంది యువతకు శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారు. ఈ 1.34 లక్షల కుటుంబాలకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేసిన మేలును మా ఉద్యోగులెవరూ ఎప్పటికీ మరువలేరు. రాష్ట్రంలో కొంతమంది ఉద్యోగ సంఘాల నాయకులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం ఉద్యోగ వ్యవస్థలో సింహ భాగంగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను తప్పుదోవ పట్టించేలా రెచ్చగొడుతూ, ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు పాల్పడేలా చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నాం. సచివాలయ ఉద్యోగులు ఎవ్వరూ ఎటువంటి ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు, ఆందోళనల్లో పాల్గొనవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం'అని పేర్కొన్నారు.

## రేపు ఆన్‌లైన్ 'పెన్షన్ అదాలత్'

సాక్షి, హైదరాబాద్: నెలవారీ పెన్షన్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 10వ తేదీన ఉదయం 11గంటలకు ఆన్‌లైన్ పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్టు ఎంప్లాయ్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ప్రాంతీయ కమిషనర్ ఎం.హెచ్.వార్షి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. https://meet.google.com/cav-esqk-bzm లింకు ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈపీఎస్ చట్టం–95, అధిక పెన్షన్, ఆప్షన్ నమోదు, దరఖాస్తు విధానం తదితర అంశాలను తెలుసుకునేందుకు ఈ అదాలత్ అత్యుత్తమ వేదికని వివరించారు. సందేహాలున్న వారు, సమాచారం తెలుసుకోవాలనుకున్న వారంతా ఆన్‌లైన్ అదాలత్‌లో పాల్గొనాలని సూచించారు.

## 'స్కిల్' కుంభకోణంలో కీలక వ్యక్తి అరెస్టు

'సీమెన్స్'కంపెనీ మాజీ ఉద్యోగి జీవీఎస్ భాస్కర్‌ను అరెస్టు చేసిన సీఐడీ

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వ హయాంలో జరిగిన రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణంలో మరో కీలక వ్యక్తిని సీఐడీ అరెస్టు చేసింది. సీమెన్స్ ఇండస్ట్రియల్ సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్ మాజీ ఉద్యోగి జీవీఎస్ భాస్కర్‌ను ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఆయన నివాసంలో బుధవారం అదుపులోకి తీసుకుంది. అనంతరం ఆయన్ని న్యాయస్థానంలో హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై విజయవాడకు తీసుకువస్తున్నారు. జీవీఎస్ భాస్కర్‌తో సహా ఈ కేసులో ఇప్పటివరకు సీఐడీ 8 మందిని అరెస్టు చేసింది. రూ. 371 కోట్ల ప్రజాధనాన్ని చంద్రబాబు ప్రభుత్వ పెద్దలు కొల్లగొట్టడంలో జీవీఎస్ భాస్కర్ ప్రధాన పాత్ర పోషించారని సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. టీడీపీ ప్రభుత్వం సీమెన్స్ కంపెనీ ముసుగులో షెల్ కంపెనీలతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం రూపకల్పనలో ఆయనే కీలకంగా వ్యవహరించారు. సీమెన్స్ ఇండియా లిమిటెడ్‌కు అప్పట్లో ఎండీగా ఉన్న సుమన్ బోస్‌తో కుమ్మక్కై టీడీపీ పెద్దలు ఈ ఎంవోయూ కథ నడిపారు. అందులో భాస్కర్ కీలకంగా వ్యవహరించారు.

## 'గగన్‌యాన్'లో మహిళా వ్యోమగామికి అవకాశం

షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ వెల్లడి

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) 2024లో నిర్వహించబోయే గగన్‌యాన్ ప్రయోగంలో అంతరిక్షంలోకి పంపించడానికి ఒక మహిళకు అవకాశం కల్పించనున్నామని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించబోయే చంద్రయాన్-2 మిషన్‌కు ఒక మహిళే డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. షార్‌లోని ఎంఆర్ కురుప్ ఆడిటోరియంలో బుధవారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలో రాజరాజన్ మాట్లాడారు. చంద్రయాన్-2 ప్రయోగంలో కూడా ఎక్కువగా మహిళలే పాల్గొనడం విశేషమన్నారు. స్వయంకృషి, పట్టుదల ఉంటే జీవితంలో మహిళలు కూడా పురుషులకు ఏమీ తీసిపోరని కోయంబత్తూరు పీఎస్‌సీ కళాశాల ఆర్ట్స్ అండ్ సైన్స్ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ జయంతశ్రీ బాలకృష్ణన్ అన్నారు.



మాట్లాడుతున్న రాజరాజన్

అనంతరం షార్ కేంద్రంలోని మహిళలకు, విద్యార్థినులకు పలు రకాల ఆటల పోటీలు, డ్యాన్స్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేట్ డైరెక్టర్ ఆర్ వెంకట్రామన్, షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ ఇంకా షార్‌లో మహిళా ఇంజినీర్లు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

## విమానంలో ధూమపానం.. యువతి అరెస్టు

దొడ్డబళ్లాపురం: విమానంలో ధూమపానం చేసిన యువతిని బెంగళూరులోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం భద్రతా సిబ్బంది అరెస్టు చేశారు. పశ్చిమబెంగాల్‌లోని సీల్దా జిల్లాకు చెందిన ప్రియాంక చక్రవర్తి (24) అనే యువతి ఆదివారం అర్ధరాత్రి కోల్‌కతా నుంచి బెంగళూరు వస్తున్న ఇండిగో విమానంలో ప్రయాణించింది. ఆమె విమానం టాయ్‌లెట్లోకి వెళ్లి ధూమపానం చేయసాగింది. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో సిబ్బంది తలుపులు తెరవాలని కోరగా, ఆమె సిగరెట్‌ను డస్ట్‌బిన్‌లో పారవేసి తలుపులు తీసింది. పొగ వాసన రావడంతో సిబ్బంది తనిఖీ చేయగా డస్ట్‌బిన్‌లో సిగరెట్ దొరికింది. విమానం బెంగళూరులో దిగగానే ఎయిర్‌పోర్టు భద్రతా సిబ్బంది ఆమెను అదుపులోకి తీసుకున్నారు. విమానంలో పొగ తాగడం నేరం కాబట్టి కేసు నమోదు చేసి ప్రియాంకను అరెస్టు చేశారు.


**జిల్లా వార్తలు**

### గిరిజన అభ్యర్థులకు ఉచిత గ్రూపు-4 శిక్షణ



భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో గ్రూపు–4 ఉద్యోగాలకు సిద్ధమవుతున్న గిరిజన అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు డిగ్రీ సర్టిఫికెట్, గ్రూప్–4 దరఖాస్తు, పాస్‌ఫోటో, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్లతో ఐటీడీఏలోని భవిత సెల్, సుదిమల్ల(ఇల్లెందు), మద్దులపల్లి(ఖమ్మం)లోని యూత్ ట్రైనింగ్ సెంటర్లలో ఈనెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం భవిత సెల్, యూత్ ట్రైనింగ్ సెంటర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

### 'టామ్‌కామ్' ద్వారా ఆస్ట్రేలియాలో ఉద్యోగావకాశాలు



సింగరేణి(కొత్తగూడెం): ఉపాధి కల్పన, శిక్షణ శాఖ సంస్థ అయిన తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్) ఆధ్వర్యాన ఆస్ట్రేలియా దేశంలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు భద్రాద్రి జిల్లా ఉపాధి కల్పనాధి కల్పనాధికారిని వేల్పుల విజేత తెలిపారు. ఐటీఐ ఫిట్టర్ ట్రేడ్‌తో ఉత్తీర్ణత సాధించి, ఈల్ట్‌లో స్కోర్ ఉండాలని, లేదంటే ఐటీఐ, ఎస్సెస్సీ ఇంగ్లిష్ మీడియంలో చదివి 40 ఏళ్ల లోపు వయస్సు కలిగి, మైనింగ్‌లో కనీసం ఐదేళ్లు పనిచేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో ఈనెల 14వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఎంపికైన వారికి నాలుగేళ్ల పరిమితితో వీసా ఇవ్వనుండగా, వార్షిక వేతనం రూ.39 లక్షలపైగా చెల్లిస్తారని తెలిపారు.

### కేటీఆర్‌ను కలిసిన పౌల్ట్రీ రైతులు

సాక్షి, మహబూబాబాద్: రాష్ట్ర పౌల్ట్రీ రైతుల సంఘం నాయకులు బుధవారం తొర్రూరు పర్యటనలో ఉన్న మంత్రి కేటీఆర్‌ను కలిశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్ల సరఫరాలో కొత్త నిబంధనలు ఇబ్బందికరంగా ఉన్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రైతుల ఇబ్బంది దృష్ట్యా పాత విధానాన్ని అమలు చేయాలని కోరారు. వినతి పత్రాన్ని పరిశీలించిన కేటీఆర్ రైతులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో వరంగల్, ఖమ్మం, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల నాయకులు శ్యాంసుందర్‌రావు, రామారావు, సుబ్రహ్మణ్యం, రాంప్రసాద్, గులాం సందాని తదితరులు ఉన్నారు.

# ఉత్తీర్ణతకు ఊతమిచ్చేలా..!

- ఎస్సెస్సీ విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించిన అభ్యాస దీపికలు పంపిణీ
- ప్రతిరోజూ ప్రత్యేక తరగతులు, అల్పాహారంతో ఊరట
- ఉమ్మడి జిల్లాలో 420 పాఠశాలలు, 15,838 మంది విద్యార్థులు



గోవిందాపురం(ఎల్) జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో అభ్యాస దీపికలు చూపిస్తున్న విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించింది. గతంలో ఎస్సెస్సీ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా జిల్లా స్థాయిలో హెచ్ఎంలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించేవారు. ఆ తర్వాత ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. అయినప్పటికీ పలు జిల్లాల్లో ఫలితాలు మెరుగుపడకపోవడంతో ప్రభుత్వం ఇంకో అడుగు ముందుకేసింది. ఈ ఏడాది నుంచి నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్(ఎన్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యాన అభ్యాస దీపికలను ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు అందజేసింది. ఖమ్మం జిల్లాలో 211 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా 6,794 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 209 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలుండగా 9044 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వీరందరికీ పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండడమే కాక అల్పాహారం సైతం సమకూరుస్తున్నారు.

**నాలుగు సబ్జెక్టులపై ముద్రణ**

పదో తరగతి విద్యార్థులకు గణితం, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాల్లోని ప్రధాన అంశాలను తీసుకొని అభ్యాస దీపికలు ముద్రించారు. వీటిని జెడ్పీ, ప్రభుత్వ, కేజీబీవీలతో పాటు మోడల్ స్కూళ్లలోని పదో తరగతి విద్యార్థులకు అందజేశారు. వీటి ఆధారంగా ప్రత్యేక తరగతులు బోధిస్తుండడంతో విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునేలా పాఠ్యాంశాలు ఉండడంతో ఒత్తిడి లేకుండా పరీక్షలు రాస్తారని చెబుతున్నారు.

**గత అనుభవాలను గుర్తించే..**

గతంలో ప్రతీ జిల్లాలోనూ నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంగా పెట్టుకున్నా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదు. దీంతో విద్యార్థులు ఎక్కువ మంది ఏయే సబ్జెక్టుల్లో ఫెయిలవుతున్నారు.. ఎందులో మార్కులు తక్కువగా వస్తున్నాయనే విషయాన్ని నిపుణులతో నివేదికలు తయారు చేయించారు. ఈ నివేదికల ఫలితాల ఆధారంగా ప్రభుత్వం అభ్యాస దీపికలు సిద్ధం చేయించింది. తద్వారా పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఇవి ఉపయోగపడుతాయని చెబుతున్నారు.

**ఉపయోగకరంగా ఉన్నాయి**



ప్రభుత్వం అందించిన అభ్యాస దీపికలు ఉపయోగకరంగా ఉన్నాయి. గణితంలో భావనలు, బహుళ ఐచ్ఛిక ప్రశ్నలు చక్కగా అర్థమవుతున్నాయి. అన్ని గ్రేడ్ల విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా తయారుచేశారు. తద్వారా గణితం భావనల అవగాహన, పునశ్చరణ తేలికైంది.

– ఎం.ప్రసన్న, విద్యార్థి, జెడ్పీహెచ్ఎస్, మంగళగూడెం

**సులభంగా అర్థమయ్యేలా..**



విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ప్రభుత్వం అభ్యాస దీపికలు అందించింది. ప్రతీ విద్యార్థికి అర్థమయ్యే రీతిలో సులభంగా రూపొందించారు. ముఖ్యంగా భౌతిక, రసాయన శాస్త్రాలకు సంబంధించి ప్రయోగాలు, భావనలు, విశ్లేషణలు బాగున్నాయి. ప్రతీ విద్యార్థి సొంతంగా నేర్చుకోవచ్చు.

– డీవీఎస్ రెడ్డి, ఫిజికల్స్ సైన్స్ ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్ఎస్, మంగళగూడెం

**బాగున్నాయి...**



పరీక్షలు సమీపిస్తున్న సమయాన విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని అభ్యాస దీపికలు ఇచ్చారు. ఇవి ఎంతో బాగున్నాయి. అందరికీ అర్థమయ్యే రీతిలో ఇలాంటి దీపికలు ఇవ్వటం బాగుంది. ప్రతిరోజు వీటిని చదువుతుండగా, మంచి మార్కులు సాధిస్తామనే నమ్మకముంది.

– ఎం.కీర్తి, విద్యార్థి, జెడ్పీహెచ్ఎస్ గోవిందాపురం(ఎల్)

**చక్కగా ఉపయోగపడుతున్నాయి**



రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అభ్యాస దీపిక పుస్తకాలు విద్యార్థులకు చక్కగా ఉపయోగపడుతున్నాయి. నిపుణులతో సిద్ధం చేయించడంతో విద్యార్థులు సబ్జెక్టులపై పట్టు సాధించడం సులభమవుతుంది. అన్ని గ్రేడ్ల విద్యార్థులు వీటి సాయంతో చదువుకుంటే మంచి మార్కులు రావడం ఖాయం.

– పి.శివ నర్సింహారావు, గణిత ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్ఎస్ గోవిందాపురం(ఎల్)

## 'ఉపాధి'ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

జూలూరుపాడు: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి బి.వెంకట్ విమర్శించారు. బుధవారం జూలూరుపాడు సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించడంతోపాటు, రోజువారీ వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కార్పొరేట్ల జీతగాడిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు, వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచి పేద, మధ్యతరగతి ప్రజలపై మోయలేని భారాన్ని మోపుతున్నారని అన్నారు. పోడు సాగుదారులకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా వచ్చే నెల 5న నిర్వహించే పార్లమెంట్ ముట్టడిని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుర్రి ప్రసాద్, మచ్చా వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య, రేపాకుల శ్రీనివాస్, బి.చిరంజీవి, నిమ్మల వెంకన్న, ముదిగొండ రాంబాబు, బత్తుల వెంకటేశ్వర్లు, ఆలేటి కిరణ్, శెట్టి వినోద్ పాల్గొన్నారు.

## కొబ్బరి రైతులకు రాయితీలు

**లబ్ధిదారుల పరిశీలన చేపట్టిన ఏపీ అధికారి**

అశ్వారావుపేట: అశ్వారావుపేట పరిసర ప్రాంతాల్లో కొబ్బరి సాగు చేస్తున్న రైతులకు రాయితీలు అందించేందుకు ఏపీ కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు(సీడీబీ) ఫీల్డ్ ఆఫీసర్ మత్తే కిరణ్ బుధవారం లబ్ధిదారుల పరిశీలన నిర్వహించారు. గత నెలలో కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు నుంచి కొబ్బరి సాగు ప్రోత్సాహకాలపై సీడీబీ రైతులకు అవగాహన కల్పించి, ఆసక్తి గల రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఈ నేపథ్యంలో ఫీల్డ్ ఆఫీసర్ కిరణ్ క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. అనంతరం ఆయన కాకాని పద్మశేఖర్‌కు చెందిన కొబ్బరితోటలో విలేకరులతో మాట్లాడుతూ.. ప్రోత్సాహకాల కోసం 50 హెక్టార్లలోని తోటలకు చెందిన 120 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని, క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం లబ్ధిదారులను ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కొబ్బరి సాగు ఉత్పత్తిదారుల సమాఖ్య నాయకులు ఆలపాటి రామ్మోహనరావు, కె.పుల్లయ్య, అల్లూరి బుజ్జి, రామారావు తదితరులు పాల్గొన్నారు.



వివరాలు సేకరిస్తున్న కిరణ్

## వైభవోపేతంగా 'శ్రీవారి కల్యాణం'

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలం అనంతారం గ్రామంలోని అనంతాద్రి గుట్టపై వెలసిన వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం శ్రీవారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు గొడవర్తి చక్రధరాచార్యులు పర్యవేక్షణలో సహ అర్చకుడు గొడవర్తి శ్రవణ్‌కుమారాచార్యులు శ్రీవారి సన్నిధిలో అష్టోత్తర శతనామపూజ, అర్చనలు చేశారు. అనంతరం అలివేలుమంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, డాక్టర్ సీతామహాలక్ష్మి దంపతులు స్వామవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, సౌజన్య స్వామివారిని దర్శించుకున్నారు. కాగా శ్రీ వీరభద్ర స్వామి మహిళా కోలాట బృందం, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర సేవా ట్రస్టు కోలాట బృందం ఆధ్వర్యంలో మహిళలు కోలాట ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ నూకల రామచంద్రారెడ్డి, జ్యోతి దంపతులు, ట్రస్టు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



శ్రీనివాసుడి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

## ఆడకూతురును భారంగా భావించొద్దు




కేక్ కట్ చేస్తున్న జడ్జి డానీరూత్

**ఖమ్మం అదనపు జిల్లా అదనపు జడ్జి డానీరూత్**

ఖమ్మంగాంధీచౌక్: తల్లిదండ్రులు ఆడకూతురును భారంగా భావించొద్దని ఖమ్మం జిల్లా అదనపు జడ్జి ఆర్.డానీరూత్ అన్నారు. యంగ్‌మెన్స్ క్రిస్టియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె మాట్లాడారు. సమాజంలో మహిళల పాత్ర గొప్పగా ఉందని, పురుషులతో సమానంగా బరువు, బాధ్యతలను నిర్వహిస్తున్నారని తెలిపారు. మహిళలు కుటుంబానికి, సమాజానికి సేవలందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని అభినందించారు. అంతకుముందు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బీజీ క్లైమెంట్, ఖమ్మం కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ, ఆర్టీసీ ఆర్ఎం ఎస్తేర్ ప్రభులత, వ్యవసాయాధికారి విజయనిర్మల, వైద్యురాలు కె. స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.